



స్టేడియానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి భరత్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యేలు

హెచ్ఎన్ఎస్ఎస్ సాగదు..

నీరు పారదు..!

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) లైనింగ్ పనులు ముందు సాగకపోవడం, లైనింగ్ పనులు పూర్తి కాకపోవడంతో నీరు పారే అవకాశం కనిపించడం లేదు. జూన్ చివరి నాటికి కాలువ లైనింగ్ పనులు పూర్తి చేస్తామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెబుతున్నా ఇప్పటి వరకూ లైనింగ్ పనులు 20 శాతమే పూర్తయ్యాయి. 18 తూములకు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. అవి కడితే ఆయకట్టు పెరిగే అవకాశం ఉంది. జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్, ఇన్‌ఛార్జీ మంత్రి రామానాయుడు చొరవ తీసుకుంటేనే లాభం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది...

- 20 శాతమే పూర్తయిన లైనింగ్ పనులు
- తూములు కడితే ఆయకట్టు పెరిగే అవకాశం
- మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుంటేనే లాభం



హంద్రీనీవా ప్రధాన కాలువ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/పత్తికొండ

రాయలసీమ కరువు పల్లెసీమల జల ప్రదాయిని హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం. శ్రీశైలం డ్యాం ఎగువన మల్యాల వద్ద 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగు నీరు ఇవ్వాలన్నది లక్ష్యం. ఫేజ్-1 నందికొట్కూరు మండలం మాల్యాల ప్రధాన మల్యాల లిఫ్ట్ నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కిలోమీటర్ల మేర కాలువ తవ్వారు. 8 లిఫ్టులు ఏర్పాటు చేశారు. 12 పంపుల ద్వారా 3,850 క్యూసెక్కులు పోసి ఖరీఫ్ సీజన్‌లో 40 టీఎంసీలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కాలువ 2 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం కూడా లేదు. ఈ లెక్కన 20-25 టీఎంసీలకు మించి తీసుకోలేని పరిస్థితి ఉంది. ఏటా 15-20 టీఎంసీలు నష్టపోవాల్సి వస్తుంది. కృష్ణా నదీ వరద జలాలు కడలి పాలవుతున్నా కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. పూర్తిస్థాయి వరద జలాలు రాయలసీమ జిల్లాలకు మళ్లించాలనే సంకల్పంతో గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి విస్తరణ పనులు చేపట్టారు. దాదాపు రూ.285.77 కోట్లు ఖర్చు చేశారు. జూన్ నెలాఖరులోగా ఫేజ్-1 పరిధిలో బ్యాలెన్స్ (మిగులు) పనులు రూ.690 కోట్లతో చేపడుతున్నారు. ఇప్పటి వరకూ లైనింగ్ పనులు 20 శాతమే పూర్తయ్యాయి. పూడికతీత పనులు 60 శాతం పూర్తయ్యాయి. జిల్లాలో హంద్రీనీవా కాలువ ద్వారా పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువ కింద 61,400 ఎకరాలు, కృష్ణగిరి జలాశయం కింద 5,090 ఎకరాలు, కాలువ పొడవున తూములు (స్లూయిస్) ద్వారా 13,500 ఎకరాలు చొప్పున 80 వేల సాగునీరు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం 29 వేల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వడం లేదు. పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువల అసంపూర్తి పనులు పూర్తిచేస్తే ఆయకట్టుకు సాగునీరు ఇవ్వవచ్చు. ఆ దిశగా చర్యలు శూన్యం. కళ్ల ముందే కృష్ణా జలాలు తరలిపోతుంటే నిత్యం కరువు. వలసలతో తల్లడిల్లే కర్నూలు జిల్లా కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు.

స్లూయిస్ సామర్థ్యం పెంచకపోతే ప్రమాదమే..

పత్తికొండ (పందికోన) జలాశయానికి నీటిని మళ్లించేందుకు హంద్రీనీవా కాలువకు ఇన్‌లెట్ స్లూయిస్ ఏర్పాటు చేశారు. అలాగే కుడి, ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు రెండు అవుట్లెట్స్ స్లూయిస్‌లు ఏర్పాటు చేశారు. అవుట్ లెట్ స్లూయిస్ కంటే ఇన్‌లెట్ స్లూయిస్ సామర్థ్యం ఎక్కువగా ఉండాలని లేదా సమానంగానైనా ఉండాలని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఇంజనీరింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఇన్లెట్ తూమును 428.72 క్యూసెక్కులు (12.14 క్యూమెక్స్) ప్రవాహ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. జలాశయం నుంచి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు కుడి కాలువ అవుట్‌లెట్ తూము 670.98 క్యూసెక్కులు (19 క్యూమెక్స్), ఎడమ కాలువ అవుట్లెట్ తూము 141.26 క్యూసెక్కులు (4 క్యూమెక్స్) కలిపి రెండు అవుట్‌లెట్ తూములు 811.24 క్యూసెక్కులు (23 క్యూమెక్స్) సామర్థ్యం ఏర్పాటు చేశారు. అంటే అవుట్‌లెట్ స్లూయిస్ కంటే ఇన్‌లెట్ స్లూయిస్ 382.52 క్యూసెక్కులు (10.86 క్యూమెక్స్) తక్కువ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ఇది ఇంజనీరింగ్ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని ఇంజనీర్లు అంటున్నారు. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో వివిధ గ్రామాలకు తాగునీరు ఇచ్చేందుకు 0.650 టీఎంసీలతో డీపీఆర్ తయారు చేశారు. దీంతో ఇన్‌లెట్ స్లూయిస్ సామర్థ్యాన్ని 25 క్యూమెక్స్ (882.87 క్యూసెక్కులు)లకు పెంచాలని, లేదంటే భవిష్యత్తులో పత్తికొండ జలాశయం తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంక్‌గా మారే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

18 తూములు తవ్వితే 16,908 ఎకరాలకు సాగునీరు

జిల్లాలో ప్రస్తుతం కేవలం నాలుగు స్లూయిస్‌లు మాత్రమే ఉన్నాయి. 22.02 కిలోమీటర్ల నుంచి 141.375 కిలోమీటర్ల వరకూ కాలువ వెంబడి 18 తూములు తవ్వితే.. దాదాపు 56 గ్రామాల్లో 16,908 ఎకరాలకు అదనంగా సాగునీరు ఇవ్వవచ్చు. అంతేకాదు భూగర్భ జలాలు పెరగడం ద్వారా బోరుబావుల కింద సాగు విస్తీర్ణం పెరుగుతుంది. గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విస్తరణ పనులు పూర్తిచేస్తే ఆ తరువాత తూములు ఏర్పాటుకు ఏమాత్రం అవకాశం ఉండదు. అంతలోపు జిల్లా మంత్రి టీజీ భరత్, జిల్లా ఇంఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, పాణ్యం, పత్తికొండ ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, కేఈ శ్యాంబాబులు ప్రభుత్వాన్ని ఒప్పించి తూములు ఏర్పాటుకు చర్యలు తీసుకోసుకుంటేనే లాభం ఉంటుంది.

తూముల ప్రతిపాదనలు ఇలా..

గ్రామం	లబ్ధిపొందే గ్రామాలు	అదనపు ఆయకట్టు (ఎకరాలు)
గార్గేయపురం	6	1,015
నాయకల్లు	6	500
తొగర్చేడు	5	700
మల్లికార్జునపల్లె	1	300
లద్దగిరి	1	300
నార్లాపురం	4	1,000
ఎర్రగుడి	5	2,500
కంబాలపాడు	1	1,297
కుర్మగిరి	1	1,875
పెనుమాడ	2	621
దూదేకొండ	2	1,200
హోసూరు	3	1,250
బూరుజుల	3	750
పెరవలి	3	600
బొమ్మనపల్లి	7	1,500
మద్దికెర	5	1,500
మొత్తం	**56**	**16,908**

ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి పూర్తి చేయాలి



హెచ్ఎన్ఎస్ఎస్ రాయలసీమకు వరప్రసాదం లాంటిది. తగిన నిధులు వెచ్చించకపోవడం, సమయాన్ని సరిగ్గా వాడకపోవడం వల్ల 20 శాతం లైనింగ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. పనులు పూర్తిచేయకపోవడం వల్ల 15 నుంచి 20 టిఎంసిల నీరు నష్టపోవాల్సి వస్తుంది. సరైన శ్రద్ధలేకపోవడం వల్ల రాయలసీమపై నిర్లక్ష్యం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రభుత్వ వైఫల్యమే. కాలువ పొడవునా తూములు ఏర్పాటు చేస్తే అదనంగా ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంటుంది. బోరుబావుల్లోనూ నీరు పెరిగే అవకాశం కూడా ఉంది. ఇప్పటికైనా మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి తూములు నిర్మించి మిగిలిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. జూలై మొదటి నాటికి నీరందిచాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.



పత్తికొండ సమీపంలో సాగుతున్న కాలువ లైనింగ్ పనులు

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



హంద్రీనీవా ప్రధాన కాలువకు తూము ఏర్పాటు చేయడంతో బీడు భూములకు సాగునీరు అందుతుంది. మద్దికేర మండల బురుజుల గ్రామం దగ్గర చిన్న వాగు వంకకు తూము ఏర్పాటు చేయడం వల్ల కొన్ని వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. సాగునీరు ప్రవహించడంతో రెండు పంటలు పండించుకోవచ్చు. ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ తూము ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- సుభాన్, హోసూరు, పత్తికొండ మండలం.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కండి

- క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్‌కు మంత్రి టిజి.భరత్ శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. మంగళవారం కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో టిడ్కో గృహ సముదాయం ఎదురుగా ఆరు ఎకరాల్లో గ్రీన్ కో కంపెనీ, సిఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్ కు మంత్రి టిజి.భరత్ శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, కెఇ.శ్యామ్ బాబు, జయనాగేశ్వర రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో బాల సాయిబాబా స్కూల్ పక్కన ఉన్న ఎసిఎ క్రికెట్ గ్రౌండ్‌లో కూడాస్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రీడలవల్ల జీవితంలో కూడా చాలా క్రమశిక్షణ కలిగి ఉంటారన్నారు. గ్రీన్ కో కంపెనీ పి4 విధానం ద్వారా ముందుకు వచ్చి సిఎస్ఆర్ కింద స్టేడియం నిర్మిస్తుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రాబోతుందన్నారు. జిల్లాలో మరిన్ని మంచి పరిశ్రమలు తీసుకొని వచ్చి ఉపాధి అవకాశాలు కూడా కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి కల్పనకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పత్తికొండలో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను కూడా త్వరలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్‌పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ కర్నూలులో నిర్దిష్ట, కేంద్రీకృత స్టేడియం ఒకటి ఉండాలనే ఉద్దేశ్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక స్టేడియం ఉంటే క్రీడాకారులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందన్నారు. ఇక్కడ పిల్లల ప్రతిభను గుర్తించి వారికి ఆహారం, వసతి సౌకర్యాలతో పాటు 15 సంవత్సరాల వరకు 40 మంది ప్రత్యేకమైన కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి క్రీడాకారులను బయటకు తీసుకొని రావాలనే ఉద్దేశ్యంతో ఈ స్టేడియం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, గ్రీన్ కో కంపెనీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, గ్రీన్ కోఅసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పాలస్తీనాపై ఇజ్రాయేల్ యుద్ధాన్ని ఆపాలని, శాంతిని నెలకొల్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దేశం పాలస్తీనాపై ఇరాన్‌పై చేసే యుద్ధాన్ని ఆపాలని కోరుతూ సిఐటియు జాతీయ కమిటీ పిలుపుమేరకు సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గడియారం హాస్పిటల్ ముందు పాలస్తీనా సంఘీభావ కార్యక్రమం సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు మాట్లాడారు. ఇజ్రాయిల్ దేశం పాలస్తీనాపై మతోన్మాద యుద్ధాన్ని చేస్తూ పాలస్తినా దేశంలో రక్తపాతం సృష్టించి ప్రపంచ పటంలో లేకుండా చేయాలనే దురుద్దేశంతో మహిళలు, పసిపిల్లలని చూడకుండా వారిని అతికిరతంగా చంపడం దుర్మార్గమ న్నారు. ఐక్యరాజ్యసమితి, మానవత్వం ఉన్న ప్రపంచ దేశాలన్నీ యుద్ధం వద్దు చర్చలతో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా అమెరికా సామ్రాజ్యవాదం వాటి ఆదాయం కోసం ఇశ్రాయేలును ప్రోత్సహిస్తున్నందున యుద్ధం కొనసాగుతుందని, భవిష్యత్తులో ఇజ్రాయేలుకు నష్టం జరుగుతుందని గుర్తు చేశారు. సామ్రాజ్యవాద దేశాలకు తల్లి అయిన అమెరికా అనవసరమైన యుద్ధాలను ప్రోత్సహిస్తూ ఆదాయం దండుకుంటుందని గుర్తు చేశారు. గతంలో చాలా దేశాలు అమెరికా ప్రోద్భలంతో ఇతర దేశాలపై యుద్ధాలు చేసి వారిని అప్పులపాలు చేసిందని చరిత్ర తెలుపుతున్న ఇజ్రాయిల్ లాంటి దేశాలు అమెరికా ఉచ్చులోపడి పాలస్తీనా సహాయక శిబిరాలపైన దాడులు చేసి అక్కడ ప్రజలు దారుణంగా హతమార్చడం మానవత్వం ఉన్న ప్రతి మనిషి ఇది సరైన పద్ధతి కాదని చెప్పినా ఇజ్రాయిల్ దేశం అహంకారంతో ముందుకు పోవడ మంచిది కాదన్నారు. అమెరికా ఉక్రెయిన్ దేశాన్ని ప్రోత్సహించి రష్యాపై యుద్ధం చేయిస్తూ ఉక్రెయిన్‌ను సర్వనాశనం చేసిందని, ట్రంపు అధికారం చేపట్టిన తర్వాత ఉక్రెయిన్‌కు యుద్ధ సహాయం కోసం అడుగుతే అక్కడ ఖనిజ సంపద కావాలని డిమాండ్ చేస్తూ ఉక్రెయిన్ పౌరుల జీవితాలతో ఆడుకున్నారని తెలిపారు. ఇజ్రాయిల్ దేశం అమెరికా సామ్రాజ్యవాదం ఉచ్చులో పడి భవిష్యత్తును సర్వనాశనం చేసుకోకుండా పాలస్తీలతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర నాయకులు మహమూద్, నాగస్వాములు, పార్వతయ్య, షేక్ష, బడేబాష, వేణు, మత్తయ్య, రాజు, సిఐటియు కార్మికులు పాల్గొన్నారు.



పాలస్తీనా సంఘీభావ కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజిబాబు



మాట్లాడుతున్న ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప వేదికపై అంజిబాబు

ఈనెల 20న మండల కేంద్రాల్లో ధర్నా

కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

తెలుగుదేశం పార్టీ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు మార్చాలని రాత్రి వేళల్లో మహిళలతో పని చేయించాలని నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 20న మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలు జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి..అంజిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ము నెప్ప, ఐఎన్‌టిసి జిల్లా అధ్యక్షులు బతకన్న, ఐఎఫ్‌టి.యు జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, ఎఐయుటియుసి జిల్లా కార్యదర్శి ఎం.నాగన్న మాట్లాడారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దుచేసి నూతనంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లను అమలు చేసే దాంట్లో భాగంగానే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దొడ్డిదారిలో 8 గంటల పని విధానాన్ని 12 గంటలు చేయాలని చూస్తుందన్నారు. రాత్రి వేళల్లో మహిళలతో పని చేయించాలని నిర్ణయించడం ఎంతో దుర్మార్గమైన విషయమని, తక్షణమే వీటిని రద్దు చేసుకోవాలని ఈనెల 20న కర్నూలు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్నటువంటి ఆశ, అంగనవాడి, మధ్యాహ్న భోజనం పథకం అదేవిధంగా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేష్, జి. చంద్రశేఖర్, టి రామాంజనేయులు, ఆర్. కృష్ణారెడ్డి, నల్లన్న సిఐటియు నగర కార్యదర్శి ఎం.విజయ్, ఐఎన్‌టిసి నగర కార్యదర్శి ఆనందు హాజరయ్యారు.

ఇకెవైసి తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి-మద్దికేర



అన్నదాత సుఖీభవ డబ్బులు రావాలంటే రైతులు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులందరూ గ్రామాలలో రైతు సేవా కేంద్రాలను, లేదా గ్రామ సచివాలయాలను, సంప్రదించి ఈనెల 20 లోపు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని పేర్కొన్నారు. ఇకవైసి చేయించకోలేకపోతే డబ్బులు రావని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం ద్వారా ఒక్కో రైతు కుటుంబానికి పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.20,000 మూడు విడుతలుగా అందజేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నగర రూపురేఖలు మార్చాలి

- -నగరపాలక అధికారులతో మంత్రి టిజి భరత్
- -ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాలపై సమీక్ష
- -అభివద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి
- -బ్యానర్లు, పోస్టర్లు అతికించడం మానుకోకపోతే కేసులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



-నగరపాలక అధికారులతో మాట్లాడుతున్న మంత్రి టిజి భరత్

నగర రూపురేఖలు మార్చేందుకు అవసరమైన మార్పులు చేపట్టి, కర్నూలును రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి.భరత్, నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ ఎస్.రవీంద్ర బాబుతో కలిసి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా గుత్తేదారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, లెస్‌లకు 5శాతం కంటే ఎక్కువ పోవద్దని సూచించారు. 5 శాతంకంటే ఎక్కువ లెస్‌లకు టెండర్ వేసిన పనులపై, క్వాలిటీ కంట్రోల్ బోర్డు ద్వారా నాణ్యత ప్రమాణాలు తనిఖీలు చేశాకే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. పనులు దక్కించుకుని ప్రారంభించకుండా జాప్యం చేస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు.అనంతరం పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో, ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. నగరం సుందరంగా, అందంగా ఉండాలంటే పట్టణ ప్రణాళిక సిబ్బంది పర్యవేక్షణ చాలా కీలకమైనదన్నారు. ఆక్రమణలు ఉపేక్షించొద్దని, దీనిపై పైస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వెండర్స్ జోన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని, బహిరంగ ప్రదేశాల రహదారులపై తోపుడు బండ్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి వ్యాపారులు ఎంతమంది ఉన్నారో, అనుమతులు ఎంత మంది తీసుకున్నారో వంటి వివరాలను వారంలోగా తనకు అందజేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో రహదారుల ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఆలస్యం చేయొద్దని స్పష్టం చేశారు. రహదారులపై, కూడళ్లపై బ్యానర్లు, పోస్టర్లు అతికించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వ్యక్తులు జరిమానాతో వినక పోతే, కేసులు నమోదు చేసేందుకు వెనకాడొద్దని స్పష్టం చేశారు. అభివృద్ధి పను లకు ఆటంకం కలిగించే ఆక్రమణలు తక్షణమే తొలగించాలని, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు అన్వేషించి వెండర్ జోన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాంతాలు సుందరంగా తీర్చిదిద్దేందుకు, క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది ప్రణాళిక రూపొందించాలని, అందుకనుగుణంగా చర్యలు తీసు కుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జ్ ఎస్ఇ శేష సాయి, ఎంఇ లీల ప్రసాద్, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అంజాద్ బాష, కార్పొరేటర్ పరమేష్, డిఇఇలు, పాల్గొన్నారు.

టిబి ముక్త్ భారత్ అభియాన్ అవగాహన ర్యాలీ

- -క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుంది
- -వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్



కోడుమూరులో అవగాహన ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

కోడుమూరు గ్రామపంచాయతీ మంగళవారం కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న ఆధ్వర్యంలో కోడుమూరు ఉపసర్పంచి ఆర్. మాధులు అధ్యక్షతన క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టిబి ముక్త్ భారత్ అభియాన్ పై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే నిమిత్తం ప్రభుత్వం టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం టిబి కేసు గుర్తింపును వేగవంతం చేయడం, మరణాలను తగ్గించడం , కొత్త కేసులను నిరోధించడానికి 60 యేళ్ల పైబడ్డ వారికి , బిఎంఐ 18 లోపు ఉన్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకి , పొగ తాగే వారికి, ఆల్కహాల్ తీసుకునే వారికి గల్ల పరీక్షలు, ఎక్రేరే పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తున్నామని తెలుపుతూ రెండు వారాల నుండి దగ్గు ఉండడం, జ్వరం, బరువు , ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడడం మొదలకు లక్షణాలు ఉన్న వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా గళ్ల పరీక్ష , ఎక్స్‌రే ఆధునికమైన సిబి నాట్, ఆర్టిపిసిఆర్ లతో పరీక్ష చేయించుకోవాలన్నారు. ఒకవేళ క్షయ వ్యాధి ఉన్న వారు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులు ఆశా కార్యకర్త పర్యవేక్షణలో వాడడం వల్ల క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ఉపసర్పంచి ఆర్ మాదన్న మాట్లాడారు. ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలని తద్వారా టిబి.రహత భారత్‌కు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ కె.కమాల్ సాహెబ్, ఉమాబాయి , సీనియర్ టిబి.సూపర్వైజర్ వెంకటేశ్వర్లు , కోడుమూరు ఒకటో సచివాలయ సిబ్బంది,ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తైక్వాండో విద్యార్థినికి శమంతకమణి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్



అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 9,10,11తేదీలలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో టిఎం హరిప్రియ అండర్ 59 జూనియర్స్ విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపియింది. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి తన నివాసంలో విద్యార్థిని హరిప్రియను శాలువా, మెమెంటోతో సన్మానించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు ఆత్మరక్షణ క్రీడ అయిన తైక్వాండోలో రాణించాలన్నారు. కర్నూలు జిల్లాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈనెల 23, 24, 25 తేదీలలో ఉత్తరాఖండ్ లోని హరిద్వార్‌లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. అనంతరం కోచ్ సతీష్ కుమార్‌ను అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు మహేశ్వరి, సాయిబాబా పాల్గొన్నారు.



జమ్మన్న భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న అంజిబాబు, రాధాకృష్ణ, తదితరులు

జమ్మన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఉపాధ్యాయ కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత వై.జమ్మన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సిపిఎం జిల్లా నాయకులు అన్నారు. వై.జమ్మన్న మృతదేహాన్ని సందర్శించి ఆయనకు నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ ఎండి.అంజిబాబు, ఎండి ఆనంద్‌బాబు, ప్రజాశక్తి మేనేజర్ నరసింహ తదితరులు కర్నూలు సెంట్రల్ ప్లాజాలోని ఆయన స్వగృహంలో వై జమ్మన్న భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థాయి ఎదగడానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన పని చేసే ప్రతి చోట విద్యార్థులకు నిరంతరం మెలకువలు నేర్పుతూ వారు ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పడేవారని కొనియాడారు. అంతేకాకుండా ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉంటూ, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగిన సందర్భంలో ప్రజల తరఫున నిలబడే వారని కొనియాడారు. జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ ఉద్యమాలకే కాకుండా ప్రజా ఉద్యమాలకు కూడా తోడ్పాటు అందించేవారని అన్నారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలోపేతం చేయడంలో ఆయన కృషి ఎంతో ఉందని అన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని జమ్మన్న ఆశయ సాధన కోసం ఉద్యమకారులందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి కర్నూలు డివిజన్ ఇంచార్జ్ ఎం.రాజు, ప్రజాశక్తి విలేకరులు సత్యనారాయణ, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి విషప్రచారం మానుకోవాలి

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తల్లికి వందనం కార్యక్రమంపై వైసిపి బులుగు మీడియా విషం చిమ్ముతోందని, దాన్ని మానుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తుంటే వైసిపి నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసిపి నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. వైసిపి పాలనలో రూ.13 వేలు ఇచ్చారు. అంటే రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందన్నారు. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధనకు గురిచేశారన్నారు.కేజి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తానని చెప్పి బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేశారని ఆరోపించారు.

దళితులపై వివక్ష ఎందుకు..?

- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని కరణి గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు దళితులపై ఎందుకు వివక్ష చూపుతున్నారని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు నివాసం ఉంటున్న కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, దళిత కాలనీలు ఇంతవరకు అభివృద్ధి చెందాలేదని తెలిపారు. ఎస్సీ కాలనీలో ఏ ఒక్క చోటా డ్రెయినేజీ కానీ, సిసి రోడ్లు కానీ వేయకుండా కుల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా 'వాళ్ల మాకు ఓట్లు వేయలేదు. మా పార్టీ కాదు' అంటున్నారని తెలిపారు. కూటమి నాయకులు దళితులు నివాసమున్న కాలనీల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ వేయాలని కోరారు. లేకపోతే ఎస్సీలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం మండల కన్వీనర్ బి.ఈరన్న, మండల నాయకులు చిన్న మారయ్య, నాగరాజు, గ్రామస్తులు హరిజన నాగరాజు, శివయ్య, హుసేని, ఎంకయ్య, మారెమ్మ, ఎల్లమ్మ, తాయమ్మ పాల్గొన్నారు.

బదిలీ ఎఒకు ఘన సన్మానం



బదిలీ ఎఒ జయలక్ష్మిని సన్మానిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ఎఒగా గత మూడేళ్లుగా పని చేస్తూ ఇప్పుడు జరిగిన సాధారణ బదిలీల్లో ఆదోనికి బదిలీపై వెళ్తున్న ఎఒ జయలక్ష్మిని ఎఇఒ రమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిఇఒలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎఒ జయలక్ష్మి అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. ఆమె మాట్లాడుతూ... ఇక్కడ పని చేస్తున్న రోజుల్లో సిబ్బంది అంతా తమకు అన్ని రకాలుగా సహకారం అందించారని తెలిపారు. ఉన్నతాధికారులు ఏ సమాచారం అడిగినా వెంటనే తమకు చేరవేశారని, అందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఉద్యోగికీ బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడ పని చేసినా ప్రజలకు మంచి చేస్తే మనకు కూడా మంచి జరుగుతుందని చెప్పారు. రంగస్వామి, ప్రతాప్ నాయుడు, సుబ్బరాయుడు, వంశీ, బాష, మనోహర్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడే పత్రిక.. ప్రజాశక్తి...

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్



ఏడాది పాలన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వీరభద్రగౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి

ప్రతి అక్షరం ప్రజల పక్షం ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే పత్రిక ప్రజాశక్తి అని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.వీరభద్ర గౌడ్ తెలిపారు. ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై, కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజాశక్తి ప్రచురించి ప్రత్యేక అనుబంధాన్ని మంగళవారం ఆలూరు టిడిపి కార్యాలయంలో వీరభద్రగౌడ్, నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాశక్తి పత్రిక రాజకీయాలకతీతంగా నిష్పక్షపాతంగా వార్తలు రాయడంలో ముందు ఉండటం హర్షనీయమని తెలిపారు. పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగుల పక్షాన నిలవడం అభినందనీయమని చెప్పారు. నియోజక వర్గంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజాశక్తి ప్రత్యేక సంచికను తీసుకొని రావడం అభినందనీయమని తెలిపారు. ఆస్పరి మండల మాజీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఆలూరు బ్రాంచి కెనాల్ డిసి ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ శాలిసాబ్, హాలహర్వి సర్పంచి మల్లికార్జున, వెలమకూరు సర్పంచి భాస్కర్, దుబ్బలింగ, టిడిపి ఆస్పరి మండల యువ నాయకులు రాజ్‌కుమార్, మేకల రంగనాథ్, ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్, హాలహర్వి విలేకరి వీరభద్రగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- దేవనకొండ

గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ, సిసి రోడ్ల సమస్యలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు మహేంద్ర కోరారు. మంగళవారం ఎంపిడిఒ రమణారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై నడిచే పరిస్థితి లేదని, గుంతలమయంగా చిన్న వర్షానికి మడుగుల్లాగా నీరు నిలిచి నడవలేని పరిస్థితి ఉందని తెలిపారు. గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యతో అపరిశుభ్రత నెలకొని మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. మండల సహాయ కార్యదర్శి మహేంద్ర, మురళీ, హనుమంతు, చిన్న, రవి కృష్ణ పాల్గొన్నారు.

'తల్లికి వందనం'పై విమర్శలు మానుకోవాలి

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి

తల్లికి వందనం పథకంపై విమర్శలు చేయడం మానుకోవాలని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.వీరభద్ర గౌడ్ తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు ఏ మొహం పెట్టుకొని తల్లికి వందనం పథకంపై విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. 'తల్లికి వందనం' ప్రతి విద్యార్థీ తల్లిదండ్రులకు అందిందని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ప్రతి విద్యార్థీ నుంచి రూ.2 వేలు ముట్టాయని చౌకబారు మాటలు మాని నిరూపించాలని హితవు పలికారు. లేకపోతే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేని వైసిపి నాయకులు కూటమిపై బురద జల్లుతూ ఉనికిని కాపాడుకునేందుకు ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా చౌకబారు మాటలు మానుకోకపోతే 11 సీట్లకే పరిమితమైన వారికి ఒక్క సీటు కూడా రాదన్నారు. నియోజకవర్గంలో ఉపాధి కింద మండలానికి రూ.3 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆస్పరి మండలంలో బిటి రోడ్డుకు రూ.1.30 కోట్లతో భూమి పూజ చేసినట్లు చెప్పారు. రూ.1.24 కోట్లతో చాకిబండ బిటి రోడ్డు మంజూరయినట్లు తెలిపారు. ఆలూరు బ్రాంచి కెనాల్ డిసి ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప, హాలహర్వి సర్పంచి మల్లికార్జున, వెలమకూరు సర్పంచి భాస్కర్, ఆస్పరి మండల మాజీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, యువ నాయకులు రాజ్ కుమార్, మేకల రంగనాథ్ పాల్గొన్నారు.



హాలహర్వి: సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్రరెడ్డి విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల ప్రచారంలో ఇంట్లో ఇద్దరు పిల్లలకు రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రచారం చేశారని, అధికారంలోకి వచ్చాక ఒకే ఒక విద్యార్థికి రూ.13 వేలు ఇచ్చారని తెలిపారు. విమర్శలు మానుకొని రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాన్ని చూసి సంతోషించాలని హితవు పలికారు. బిజెపి జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, వీరేష్ గౌడ్, కాత్రికి చంద్ర పాల్గొన్నారు.



మంత్రాలయం : సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రంగనాథ్ బాబు

ప్రజాశక్తి - చిప్పగిరి

నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రంగనాథ్ బాబు అధికారులకు, ప్రజలకు తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో మండల అధికారులతో యోగాంధ్ర, ప్రభుత్వ సర్వేల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 21న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నంలో తలపెట్టిన జాతీయ యోగా దినోత్స వాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అందుకు గ్రామాల్లో యోగాపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. యోగాపై వివరించి వారి పేర్లు నమోదు చేసుకోవాల న్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న సిటిజన్ సర్వే, ఇతర సర్వేలు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ముఖ్యంగా వైద్య, విద్య, తాగునీటి విభాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు ఎదురవకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటే గ్రామాల్లో అధికారులపై మంచి అభిప్రాయం ఏర్పడుతుందని తెలిపారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న, ఎంఇఒ సావిత్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మండల సర్వేయర్ నారాయణ, అస్పిరేషనల్ బ్లాక్ అధికారి నరసింహులు, హౌసింగ్ ఎఇ విజయ్ కుమార్, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మండల అధికారులతో మాట్లాడుతున్న రంగనాథ్ బాబు

రాఘవేంద్రుని సన్నిధిలో అంజనీ కుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆయనకు శేష వస్త్రం అందజేశారు. డీఎస్పీ నర్సిరెడ్డి, ఎస్ఐ నజీర్ అహ్మద్ ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో ఉన్న అంజనీ కుమార్

అభివృద్ధికి సహకారం అవసరం

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

అభివృద్ధిలో వెనుకబడిన ఆదోనిలో ఇప్పుడిప్పుడే ప్రగతికి అడుగులు పడుతున్నాయని, అందరూ సహకరించాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. మంగళవారం ఆదోనిలో పోలీసు కంట్రోల్ రూమ్ వెనకాల ఉన్న కళాశాల ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోనిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేయాల్సిన పాలకులు గతంలో నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ఆదోనిలో ప్రధానమైన తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని చెప్పారు. ఇక్కడి ప్రజలు ఎక్కువగా వలస పోతున్నారని, పిల్లల చదువుకు ఆటంకం ఏర్పడి బాల కార్మికులుగా మారుతున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా రెసిడెన్షియల్ పాఠశాల, కస్తూర్బా పాఠశాల మరో హాస్టల్ భవనం అవసరం ఉందన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం విశాలమైన భవనం, విద్యుత్, ఫ్యాన్లు, మురుగుదొడ్లు ఏర్పాటు చేయించామన్నారు. దీనికిగాను రూ.36.35 లక్షలు ఖర్చు అయిందని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన భోజనమందించి హాస్టల్‌లో ఉండేలా వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. గతంలో రూ.లక్షలు ఖర్చు చేసి కూడా శిలాఫలకం ఏర్పాటు చేయించి హంగామా చేశారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బాబు, వార్డెన్లు బాల మద్దయ్య, సిద్ధప్ప, సుజాత, నాయకులు సింహం నాగేంద్ర, మధుసూదన్ శర్మ, ఉపేంద్ర, సూర్య ఉన్నారు.



హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన : వైసిపి

- వెన్నుపోటు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - నందవరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనను అమలు చేస్తోందని వైసిపి నాయకులు విమర్శించారు. మంగళవారం నందవరంలో 'వెన్నుపోటు' పుస్తకాన్ని వైసిపి మండల అధ్యక్షులు జె.శివారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కెఆర్.లక్ష్మీకాంత్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, మండల సీనియర్ నాయకులు కెఆర్.రామకోటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షులు చాంద్ బాష, మండల ఉపాధ్యాయులు కోటేశ్వర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాస్ రెడ్డిలు పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఏడాది పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చి, అరాచక పాలనకు తెరలేపిన ప్రభుత్వం రాష్ట్రాన్ని హత్యలు, అత్యాచారాలు, నేరాలకు కేంద్రంగా మార్చిందని మండిపడ్డారు. ప్రజలపై దాడులు చేసిన టిడిపి నాయకులపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. వైసిపి నాయకులపై పాత కేసులను తెరచి జైళ్లకు పంపిస్తూ రెడ్ బుక్ పాలన కొనసాగిస్తోందని తెలిపారు. కరోనా వంటి సంక్షోభ సమయంలోనూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదని కొనియాడారు. సర్పంచి తోట సావిత్రిమ్మ, మిట్టా సోమాపురం సర్పంచి నరసింహులు, పెద్దకొత్తిలి సర్పంచి శివన్న, ఎంపిటిసి కోతి ఈరన్న, హెచ్.బాపురం హరి రెడ్డి, గురజాల నరసింహా రెడ్డి, రాయిచోటి నరసింహా రెడ్డి, పల్లె శంకర్ రెడ్డి, చిన్నకొత్తిలి సోమన్న, జగ్గాపురం నరసరాజు, ఎల్లా గౌడ్, మీసాల సంపత్ గౌడ్, ధర్మపురం సుధాకర్, యువ నాయకులు సూర్యప్రకాష్ రెడ్డి, ఇబ్రహీంపురం ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. **కౌతాళం** వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు 'వెన్నుపోటు' పుస్తకాన్ని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి ఆవిష్కరించారు. సర్పంచి పాల్ దినకర్, ఉప సర్పంచి సత్రి తిక్కయ్య, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, వడ్డే రాము, మండల యువజన అధ్యక్షులు తాహెర్ వలీ, శ్రీరామ్, వడ్డే చిన్ని హుస్సేని, బాషా, ఎల్లప్ప, వార్డ్ సభ్యులు రామకృష్ణ, ఖాదర్ లింగ, జంబయ్య పాల్గొన్నారు.



నందవరంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



కౌతాళం...



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పరిశుభ్రతపై అవగాహన అవసరం : కమిషనర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిశుభ్రత పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, గాంధీ సర్కిల్, మార్కెట్ ఏరియా, గంజెల్ల రోడ్డు ఏరియాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే శ్రీనివాస సర్కిల్‌లో గల అన్న క్యాంటీన్‌లో భోజన పంపిణీని తనిఖీ చేసి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

తహశీల్దార్ రమాదేవి బాధ్యతల స్వీకరణ



సబ్ కలెక్టర్‌ను కలిసిన తహశీల్దార్

ప్రజాశక్తి - మంత్రాలయం

తహశీల్దార్‌గా కె.రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రాలయం చేరుకున్న ఆమె విధుల్లో చేరారు. తుగ్గలి తహశీల్దార్‌గా పని చేసిన రమాదేవి బదిలీల్లో భాగంగా మంత్రాలయం వచ్చారు. మంత్రాలయం తహశీల్దార్‌గా పని చేస్తున్న ఎస్.రవి తుగ్గలి తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన తహశీల్దార్ రమాదేవి యోగాంధ్రను విజయవంతం చేసే ప్రక్రియలో తలమునకలయ్యారు. శ్రీమఠం ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

అనారోగ్యంతో కెజిబివి వాచ్ ఉమెన్ మృతి

ప్రజాశక్తి - నందవరం



పక్కీరమ్మ (ఫైల్)

నందవరం కస్తూరిబా స్కూల్ వాచ్ ఉమెన్‌గా విధులు నిర్వహిస్తున్న పక్కీరమ్మ (52) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి విషయాన్ని తెలుసుకున్న కస్తూరిబా ఉపాధ్యాయులు పక్కీరమ్మ మృతదేహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ... పక్కీరమ్మ నందవరంలో కస్తూరిబా పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి పని చేశారని తెలిపారు. ప్రిన్సిపల్ శైలజ ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

స్వయం ఉపాధి కల్పనకు అవకాశాలు : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి : ఎమ్మిగనూరు



బిజినెస్ యూనిట్ మోడల్స్‌లో ఆసక్తి కలిగిన ప్రజలు, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పనకు అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఎపి, ఫుడ్ ప్రాసెస్ సొసైటీ కింద అందుబాటులో ఉన్న పథకాల వివరాలు, సెంచూరియన్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించే బిజినెస్ ఎంటర్ ప్రెన్యూర్స్ నైపుణ్య శిక్షణ తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. సిరామిక్ అండ్ కుండల యూనిట్, డ్రోన్స్ స్ప్రేయింగ్, పేపర్ యూనిట్ అండ్ గార్మెంట్ క్లస్టర్, చాక్‌పీస్ యూనిట్, డ్రాగన్ ఫ్రూట్స్, అరకు కాఫీ అవుట్ లెట్, బి పార్కింగ్ టైల్స్ అండ్ బ్రిక్స్, హైడ్రో పోనిక్స్ కల్టివేషన్, గొర్రెల యూనిట్, పందుల పెంపకం, మురుగునీటి శుద్ధి కర్మాగారం, కుంకుమ పువ్వు, వెనీలా ప్లాంటేషన్, చేపల రాస్ యూనిట్, బటన్ మష్రూమ్స్, ప్రొటెక్టెడ్ కల్టివేషన్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన ప్రజలు, నిరుద్యోగ యువత బుధవారం ఉదయం 10 గంటలకు ఎమ్మిగనూరు కుర్నీ కల్యాణ మండపంలో హాజరు కావాలని కోరారు.

పండ్ల తోటలతో అభివృద్ధి

- రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ

ప్రజాశక్తి- దేవనకొండ



సేవ్ ట్రీ స్వచ్ఛంద సేవా సంస్థ పేద రైతులను దృష్టిలో ఉంచుకొని బోరు, బావులు ఉన్న రైతులకు ఉచితంగా మామిడి, నిమ్మ, సపోటా, చీని, అల్లనేరేడు పండ్ల మొక్కలను ఉచితంగా అందజేస్తున్నారని, వాటిని ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ కోరారు. మంగళవారం ఆమె మాట్లాడారు. ఇప్పటికే కప్పట్రాళ్ల గ్రామ రైతులందరికీ పండ్ల మొక్కలు ఉచితంగా ఇచ్చినట్లు తెలిపారు. సన్నకారు రైతులకే కాకుండా 10 ఎకరాలకు పైన రైతులకు కూడా మొక్కలు ఇచ్చి దాదాపు నాలుగేళ్ల వరకు వాటి బాగోగులను సంస్థ చూస్తుందని చెప్పారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొక్కలు కావాల్సిన రైతులు 9346122311 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

వ్యక్తిగత దూషణలు మానుకోవాలి

- అభివృద్ధిపై రాంపురంకైనా వస్తాం.. చర్చకు సిద్ధమా..?
- టిడిపి నాయకులు సురేష్ నాయుడు, టిప్పు సుల్తాన్, వెంకటపతి రాజు

ప్రజాశక్తి - కౌతాళం

మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులు వ్యక్తిగత దూషణలు మానుకొని, అభివృద్ధికి సహకరించాలని టిడిపి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు హితవు పలికారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి దాదాపు 16 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కేవలం మీ స్వార్థ రాజకీయాలకు, సొంత ప్రయోజనాలకు ఎమ్మెల్యేగా కొనసాగారని విమర్శించారు. ఇన్నేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగుతూ ఒక్క ప్రాజెక్ట్ అయినా తీసుకొచ్చారా..?, విద్యాభివృద్ధి కోసం డిగ్రీ కళాశాల అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. టిడిపి హయాంలో తిక్కారెడ్డి సహకారంతో రూ.200 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. కుంబాలనూరు క్యాంపు లిఫ్ట్ ఇరిగేషన్‌తో 1200 ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. నిధులు తీసుకొచ్చి పులికనుమను పూర్తి చేశామన్నారు. రాఘవేంద్ర రెడ్డి సహకారంతో రూ.కోట్లతో ఎల్ఎల్‌సి ఆధునీకరణ, రూ.15 కోట్లతో సిసి రోడ్లు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే రూ.600 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. 2014-19 వరకు.. ఇప్పుడు సంవత్సర కాలంలో అభివృద్ధిపై చర్చకు ఎక్కడికి వస్తారో చెప్పాలని, అవసరమైతే మీ స్వగ్రామం (రాంపురం)కైనా సిద్ధమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి సవాల్ విసిరారు. ఎంతమందని చెబితే అంతమంది చర్చకు వస్తామన్నారు. అభివృద్ధిని గాలికొదిలేసి ఎక్కడ వనరులుంటే అక్కడ దోచుకున్నారని విమర్శించారు. సీనియర్ నాయకులు సుబ్రమణ్య రాజు, సతీష్ నాయుడు, రామలింగ, సౌద్రి బసవరాజు, కురువ వీరేష్, రాజనందు, ముకన్న, గిరి, రమేష్, సన్నప్ప, శ్రీధర్, రామాంజినేయులు, రామచంద్ర, నాగిరెడ్డి, వీరేష్ నాయక్, మారెప్ప, వెంకటేష్, నాగరాజు, మంగలి వీరేష్, చూడి సురేష్, లింగేష్, అమ్ము వలీ, బద్రి, నబీ, భీమా, తాయన్న, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిఎం బాబుకు, లోకేష్‌కు కృతజ్ఞతలు

- కర్నూలు పరిశీలకులు మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - చిప్పగిరి



మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

కర్నూలు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా (అబ్జర్వర్‌గా) తనను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలను తెలియజేస్తున్నట్లు ఏరూరు మీనాక్షి నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి కోసం పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడినట్లు తెలిపారు. పార్టీలో అనేక పదవులను చేపట్టినట్లు చెప్పారు. పార్టీ అధిష్టానం తనను గుర్తించి కర్నూలు నియోజకవర్గ పరిశీలకులుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా టిడిపి అభివృద్ధికి, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తామని చెప్పారు.

విరుపాక్షీ.. నోరు అదుపులో పెట్టుకో..!

- ఎమ్మెల్యేపై టిడిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి- దేవనకొండ

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, మలకన్న, మాల బండ్లయ్య తెలిపారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే విరుపాక్షి కూటమి ఏడాది పాలనపై 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేశారని విమర్శించడం తగదన్నారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాల పాలనకు ప్రజలు చరమ గీతం పాడారని తెలిపారు. నిరుద్యోగుల ఆశలను నెరవేరుస్తూ 16,347 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేలా కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని విడుదల చేసిందని చెప్పారు. వైసిపి మళ్లీ అధికారంలోకి రావడమనేది ఓ కలగానే మిగులుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి గట్టిగా బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌కు సిగ్గు రాలేదని విమర్శించారు. సొంత తల్లిని, చెల్లిని వైసిపి సోషల్ మీడియా సైకోలు వేధిస్తే పైశాచిక ఆనందం పొందిన నీచమైన వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కన్నెర్ర చేస్తే రాష్ట్రంలో జగన్ తిరగలేడన్నారు. టిడిపి వార్డు సభ్యులు సుభాన్, కుక్కల ఖాసీం, రాముడు, రామాంజి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్నిక వాయిదా


- అధికారులపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎన్నుకోవడానికి మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభ రద్దయినట్లు పంచాయతీ కార్యదర్శి రామారావు తెలిపారు. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆ వ్యక్తిని తొలగించారు. ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేనందున గ్రామస్తులకు పనులు కల్పించలేకపోయారు. కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎన్నుకోవడానికి 17న గ్రామసభ నిర్వహిస్తామని ప్రజలకు అధికారులు తెలిపారు. సభను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. మంత్రాలయంలో యోగా కార్యక్రమం ఉండడం, అధికారులు వెళ్లడంతో గ్రామసభను రద్దు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రామారావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తర్వాత గ్రామ సభ నిర్వహిస్తామని చెప్పారు.

అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

గ్రామసభ రద్దు కావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు రావాలని గ్రామంలో సోమవారం దండోరా వేశారు. వారు తెలిపిన ప్రకారం గ్రామ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. సభకు అధికారులు రారని తెలిసినా అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా సభకు రప్పించారని అధికారులపై మండిపడ్డారు. పొలం పనులను వదిలి గ్రామ సభకు వచ్చామని, అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని తెలిపారు.



హాజరయిన గ్రామస్తులు

విధులకు డుమ్మా కొడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

- ఎంపిడిఒ నూర్జహాన్‌ను కోరిన గ్రామస్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మండలంలోని వగరూరు గ్రామంలో విధులకు డుమ్మా కొడుతున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నూర్జహాన్‌ను గ్రామస్తులు కోరారు. మంగళవారం 'తల్లికి వందనం' పథకం కింద తమ అకౌంట్లలో డబ్బులు పడలేదని.. విషయం తెలుసుకునేందుకు వెళ్లిన గ్రామస్తులకు చుక్కెదురైంది. గ్రామ సచివాలయంలో 8 మంది సిబ్బంది ఉద్యోగులు ఉంటే కేవలం డిజిటల్ అసిస్టెంట్ మహాలక్ష్మి మాత్రమే ఉంటూ పది రోజుల నుంచి ఉంటున్నారని, మిగిలిన సిబ్బంది రావడం లేదని వాపోయారు. డిజిటల్ అసిస్టెంట్‌ను తల్లికి వందనం గురించి ఆరా తీయగా తనకేమీ తెలియదని, విద్యా సంక్షేమ అధికారి లక్ష్మన్న చూస్తారని.. ఆయనను కలవమని చెప్పారని అన్నారు. మధ్యాహ్నం వరకు చూసినా రాలేదని చెప్పారు. సొంత పనులను చూసుకుంటూ ఫోన్ ఎత్తకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని, ఇలాంటి ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిజిటల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. గోవిందు, దేవన్న, రాగప్ప, దానియేలు, మహబూబ్ బాషా, శ్యామ్సన్, ఆంజనేయులు, మరో 23 మంది సంతకాలు చేసినట్లు తెలిపారు.

నాటుసారా విక్రయం నేరం

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ సైదుల్ తెలిపారు. మంగళవారం నవోదయం 2.0 లో భాగంగా ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గువ్వమ్మ సందు కొండల్లో నాటుసారా స్థావరాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటుసారా స్థావరాల్లోని 270 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 7 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆదోనిలోని వాల్మీకి నగర్‌కు చెందిన జగ్గాపురం ఈరన్నపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే కోసిగి మండలం ఆర్లబండ గ్రామానికి చెందిన వందగల్లు వీరేష్ పెద్దతుంబలం గ్రామానికి కర్ణాటక మద్యం సరఫరా చేస్తుండగా గ్రామ శివారులో అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 4 కర్ణాటక మద్యం బాక్సులు, ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం తగదు

- మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - ఆదోని

సమస్యల పరిష్కారానికి దీక్ష చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పీరా సాహెబ్, సోమన్న తెలిపారు. ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్ష మంగళవారం 15వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ... ప్రభుత్వం తమ పట్ల సానుకూలత చూపి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. గత మూడు రోజుల క్రితం ప్రభుత్వం తల్లికి వందనం పేరిట రూ.13 వేలు జమ చేసిందని, మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికుల పిల్లలకు జమ అయిన దాఖలాలు లేవని తెలిపారు. విషయం తెలుసుకున్న కార్మికులు ప్రభుత్వ చర్య పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తమ పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. కైలాస్, భరత్, రామాంజి, బాష దీక్షలో కూర్చున్నారు.





కర్నూలు ఇన్‌డోర్ స్టేడియంలో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు , ఉద్యోగులు పాల్గొన్న ప్రత్యేక యోగ కార్యక్రమంలో మాట్లాడుతున్న టిజి.భరత్, వేదికపై కలెక్టర్ రంజిత్‌బాష, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కమిషనర్ రవీంద్రబాబు, తదితరులు

యోగ మన వారసత్వ సంపద

విద్యతో పాటు యోగాభ్యాసం చేయాలి-పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

వేల సంవత్సరాల నుండి వస్తున్న యోగా మన వారసత్వ సంపద అని చదువుతోపాటు ఆరోగ్యంగా ఉండడం కూడా ముఖ్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు, మహిళలు, అధికారుల భాగస్వామ్యంతో 5 వేల మందితో నిర్వహించిన థీమాటిక్ యోగా ప్రదర్శన నిర్వహించారు. యోగా శిక్షకులు మునిస్వామి యోగా ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు వేయించారు. యోగ కార్యక్రమం నిర్వహణ తరువాత మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ యోగా కార్యక్రమం లో పాల్గొనేందుకు దాదాపు 11 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుని, కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అభినందించారు. యోగా ఐదు వేల సంవత్సరాల నుండి మనకు వారసత్వంగా వస్తోందని, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు యోగా చేయడం అలవర్చుకోవాలని తెలిపారు. ప్రజలకు యోగా పట్ల అవగాహన కల్పించి, ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో మే 21 నుండి జూన్ 21 వరకు నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి విశాఖపట్నం సముద్రతీరంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ యోగా కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లో స్థానం సంపాదించేలాగా ఉంటుందని మంత్రి తెలిపారు. కర్నూలు అవుట్డోర్ స్టేడియం అభివద్ధికి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా వాకింగ్ ట్రాక్ తదితర సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో కర్నూలు జిల్లా అగ్రగామిగా ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో 10 లక్షల 96 వేల మంది కర్నూలు జిల్లా నుండి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇది రాష్ట్రంలోనే అత్యధిక నమోదు అని తెలిపారు. కర్నూలు జిల్లా వాసులు ప్రతి కార్యక్రమంలోనూ ముందుండి విజయవంతం చేయాలన్న తపన తో సహకరిస్తున్నారని, ఇందువల్ల ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో కర్నూలు జిల్లా మొదటి ఐదు స్థానాల్లో ఉంటోందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ 2 లక్షల 40 వేల సింహ భాగం రిజిస్ట్రేషన్లు కర్నూలు మున్సిపల్ శాఖ ద్వారా నమోదు కావడం గర్వంగా ఉందని తెలిపారు. పారిశుధ్య కార్మికులతో యోగా నిర్వహణ అందరి సహకారంతో విజయవంతం చేశామని తెలిపారు. కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, సెట్కూర్ సిఇఒ వేణుగోపాల్, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి , ఎన్‌సిసి కల్నల్ ప్రసాద్, డిఎస్‌డిఒ భూపతి రావు, కార్పొరేటర్ పరమేష్, ఆయుష్ డాక్టర్ ప్రసాద్ , మునిస్వామి , జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్, జిల్లా అధికారులు మున్సిపల్ శాఖ సిబ్బంది మెప్మా సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థులు, పాల్గొన్నారు

జాయింట్ ఎల్‌పిఎం సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో ప్రభుత్వ భూములకు జాయింట్ ఎల్‌పిఎంల సమస్య పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఉలిందకొండ గ్రామ రైతులు కల్లూరు మండల తహశీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి కృష్ణ, మండల నాయకులు కె.మధు మాట్లాడుతూ మండలంలో ఉలిందకొండ, కొల్లంపల్లి తండా, ఎర్రకత్వ, యాపర్లపాడు, ఓబులాపురం లాంటి గ్రామాలలో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. అయితే రీ సర్వేలో ప్రభుత్వ భూములు అన్నింటికీ ఒకే ఎల్‌పిఎం నెంబర్ వేయడం వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా చూపుతున్నారని అన్నారు. రెవిన్యూ గ్రామ సభలు, రీ సర్వే గ్రామ సభల్లో ఈ సమస్యపై అర్జీలు పెట్టుకున్న ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని అన్నారు. ఈ రైతులందరికీ ఆన్‌లైన్‌లో ఎక్కువ భూమి ఉందని చూపించడం వలన నిరుపేదలను, సాధారణ రైతులు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ప్రకటిస్తున్నారని తెలిపారు. ఉలిందకొండ గ్రామంలోని దాదాపుగా 90 మంది రైతులు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అర్హులకు అందించడంలో వెనకబడిందని వారు అన్నారు. ఇప్పటికైనా తహశీల్దార్ స్పందించి ఎల్‌పిఎం సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్ స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూలరంగడు, తండా గోపాల్, రమేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మీబాయి, సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను అరికట్టాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

అధిక ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ నేతలు అనంతరత్నం, కాదిర్‌బాష, లాజరస్, నాగరాజు, డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఒ శామ్యూల్ పాల్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంతో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజులను విపరీతంగా పెంచేసేయాన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక భారం పడుతుందన్నారు. అధిక ఫీజులను వసూలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

విద్య పేరుతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలులో నారాయణ పాఠశాల ఎదుట ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శి, డి. సోమన్న, ఎస్.షాబీర్‌బాష మాట్లాడారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పత్తికొండ



వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎండి జనరల్ మెడిసిన్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆది నగేష్ సూచించారు. మంగళవారం పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని మలేరియా నివారణ మహోత్సవాలలో భాగంగా మలేరియా అంతం మనతోనే మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో రోగులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కల్పన, డాక్టర్ ఆదినగేష్ మాట్లాడారు. వర్షాకాలంలో దోమలు కుట్టడం ద్వారా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు వస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, సాయంత్రం పూట వేపాకు పొగ వేసుకోవాలని అవగాహన కల్పించారు. ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ వెంకటేశ్వర్లు, డాక్టర్లు హారిక, వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి వసూళ్లు పెంచాలి

కలెక్టర్ పి రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిఎస్‌టి పన్ను వసూలను పెంచేందుకుగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని క్యాంప్ కార్యాలయంలో ఇఎస్‌టి అంశంపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జిఎస్‌టి చెల్లించేలా కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్ కు సహకరించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్టర్ చేసుకోకుండా వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించి జిఎస్‌టి పన్ను చెల్లించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిఎస్‌టి చట్ట ప్రకారం డిఫాల్టర్ల ప్రాపర్టీస్‌ను గుర్తించి, రికవరీ చేయించడంలో రెవిన్యూ శాఖ అధికారులు కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లకు తగిన సహకారం అందజేయాలని ఆదేశించారు. నకిలీ డాక్యుమెంట్లతో అక్రమ రవాణా చేసే వారి విషయంలో మైనింగ్ శాఖ, రవాణాశాఖ అధికారులు కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌తో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి నెల సమన్వయ సమావేశాన్ని నిర్వహిస్తా మని, ఆ లోపు ఆయా ప్రభుత్వ శాఖలు ఎందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ జాయింట్ కమిషనర్ సుధాకర్ రావు, డిప్యూటీ కమిషనర్ సురేష్, ఇంచార్జి డిఆర్ఒ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి వెంకటరమణయ్య, పత్తికొండ ఆర్‌డిఒ భరత్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, డిపిఒ భాస్కర్, గనుల శాఖ అధికారి రవిచంద్, డిటిసి శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

22న విజయవాడలో వాల్మీకుల సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వాల్మీకులను ఎస్‌టిలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న విజయవాడలో జరిగే సమావేశంకి వాల్మీకులు తరలిరావాలని ఎపి వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్లార్తి అర్జున్ పేర్కొన్నారు. మంగళవారం కర్నూలులో ఆ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్‌టిలుగా గుర్తించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని అన్నారు. ఈనెల 22న జరిగే సమావేశంలో పెద్ద ఎత్తున వాల్మీకి సోదరులు పాల్గొనాలని కోరారు.